కూరల బేరం

శ్రీ ఆకెళ్ళ జానకిరామ సుబ్రమణ్యం.

'వంకాయలు...బీరకాయలు...దొండకాయలు.. బంగాళాదుంపలు...వుల్లిపాయలు...'

కేకేసుకుంటూ, కూరలమ్మే కామన్న కావిడ బుజాన వేసుకుని, కర్ర చేత్తో పట్టుకుని, కామయ్య శాస్త్రి గారింటికి బయలుదేరాడు.

ఆ వూళ్ళో కూరలమ్మటం అయిన తరువాత వూరు చివరనున్న కామయ్యశాస్త్రి గారింటికి ప్రతీరోజు మిగిలిపోయిన చచ్చు - పుచ్చు కూరగాయలు తీసుకు వెళ్ళి, ఆయన కొన్నా - కొనకపోయినా, చూపెడుతూ వుండటం కామన్నకొక అలవాటయిపోయింది.

కామన్న ఈ వ్యాపారం మొదలుపెట్టి రమారమి నాలుగునెలలు కావస్తోంది. ఏదో నాలుగురాళ్ళు సంపాదించుకుంటున్నాడు. వ్యాపారం, బుట్టలోంచి తట్టలోకి, తట్టలోంచి కావిడలోకి 'ప్రోగెస్' చూపెట్టింది.

అమెరికా - పాకిస్తాన్ 'యగ్రిమెంటు' లాగ కామయ్యశాస్త్రి గారికి కామన్నకి ఏనాడో, అంటే వ్యాపారం మొదలు పెట్టినప్పటినుంచి, కామయ్య - కామన్న 'యగ్రిమెంటొ'కటి స్థిరపడిపోయింది. ఇంత వరకు శాస్త్రి గారు ఒక్క కానీపెట్టి ఏ కూర కొనక పోయిన, ప్రతీరోజు కామన్నమాత్రం వచ్చి - వెళ్ళ టం మానలేదు.

కామయ్యశాస్త్రి గారి ఇల్లు సమీపించేసరికి, తిరిగి గట్టిగా ఒక్కసారి కేక పెట్టాడు కామన్న.

అప్పుడే పాదులకి నీళ్ళుపోసొచ్చి, పడక కుర్చీలో పడుకుని పేపరు చదువుకుంటున్న శాస్త్రి గారికి, కామన్న కేక వినబడేసరికి, అమాంతంగా, అర గజం ఎత్తు ఎగిరి, అరనిముషంలో అరుగుమీదకొచ్చి వాలారు.

ఎందుకో ఈవేళ అంత సంతోషం?

ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నారు, వంకాయ కూర వండుకోవాలని. కామన్న కేకలో 'వంకా యల'మాట వినేసరికి ఎక్కడలేని సంతోషంవచ్చి పడింది. పెరట్లో అన్నిపాదులు పెట్టుకుని వంగ తోటను మాత్రం చోటులేకుండా చేసుకున్నారు. పెరట్లో పెట్టుకున్న పాదుల మూలంగా, పైగా పావలా అర్ధా సంపాదించుకుంటున్నాడాయన.

మామూలు అలవాటు ప్రకారం, కామయ్యగారి ఇల్లు సమీపించి 'శాస్త్రులు'గారు అని పిలవబోయి, ఆయన అరుగుమీద వుండటం చూసి ఆశ్చర్యపో యాడు.

శాస్త్రిగారి 'ముఖకవళిక' చూసే సరికి కామన్నకి కొంచెం ఆశలు చిగురించాయి, ఏదైనా బేరం తగులుతుందేమోనని.

'రావోయ్ కామన్న ... అల్లా అరుగుమీద దింపుకో' అని ఆప్యాయంగా పలకరించేసరికి కామన్నకి ఆశ్చర్యం వేసింది. ఇన్నాళ్ళనుంచి చూస్తున్నాడు, ఒక్కసారికూడ కామయ్యగారు ఈ విధంగా పలక రించలేదు.

'అమ్మయ్య' అనుకుంటూ, కావిడ బుజంమీద నుంచి దింపుకుని, కర్ర అరుగుమీద పెట్టి, చతికిల పడ్డాడు కామన్న.

'ఈవేళ కూరలేం అమ్మలేదేమిటి? ... తట్టనిండా కూరలున్నాయి.' అన్నారు శాస్త్రిగారు.

'ఏం కూరలండీ...ధరలు మండిపోతున్నాయి... కొనేవాళ్ళెవరూలేరు.' అన్నాడు కామన్న కొంచెం బాధగా.

'బాగా చెప్పేవ్ ... ఇప్పుడు కూర లెక్కడపడితే అక్కడే దొరుకుతున్నాయి ... పెద్ద ధరలిచ్చి కొను క్కోవలసిన అవసరం ఏముందిలే? ... ఏ ఏ కూరలు న్నాయి?' ప్రశ్నించారు కామయ్యగారు.

'వంకాయలు, బీరకాయలు, దొండకాయలు, బంగాళాదుంపలు ...' స్పీడుగా చెప్పుకు పోతున్నాడు కామన్న.

'చాల్లే, ఆ దండకం ఆపుచెయ్యి... వంకాయలు ఎల్లా ఇస్తున్నావ్?' అడిగారు శాస్త్రిగారు.

'ఎల్లాగో అల్లాగ తీసుకుందురుగాని. మీక్కు బేరం చెపుతానేమిటండీ ... ఓ వీశ ఎయ్యమంటారా?' అంటూ తక్కెడా, తూకంరాళ్ళు పైకితీసాడు.

'మొట్టమొదట ధర చెప్పు... తరవాత చూద్దాం' అన్నారు శాస్త్రి.

'ధరకేంటిలెండి. అందరికి యిచ్చినట్టుగానే మీకూను...ఏం? మీకు కొత్తబేరం చెపుతానా?... అదేంటండోయ్,' అన్నాడు కామన్న నిక్కర్చి మనిషిలాగ.

'నీ సంగతి నా దగ్గర చెప్పకు... నువ్విప్పుడు ఈ విధంగా అంటున్నావుగదా, మొన్నను ఏం చేశావ్ చెప్పు ... నా దగ్గర తొమ్మిది దబ్బులికి ఒక్కదమ్మిడీకూడ తగ్గనని చెప్పి వాళ్ళకి ఎంతకిచ్చావ్? బేడకిచ్చావా!' అన్నారు కామయ్యగారు.

'మొన్నటి కాయలు మంచివికాదండీ ... మీవంటి పెద్దలికి అటువంటి కాయలిచ్చి మళ్ళీ పిలిపించుకోవాలా! మీచేత' అనేసరికి శాస్త్రిగారు కొంచెం చల్లబడ్డారు.

'వంకాయలు చివరికి ఎల్లాయిస్తావు? ... నీ దగ్గరన్నీ 'హైక్లాస్' రేట్లుకూడాను.' అన్నారు శాస్త్రి.

'ముత్యాల్లాంటి మువ్వొంకాయలు. కారంపెట్టి వండుకుంటే కమ్మగా వుంటాయి ... ఓ వీశ వెయ్యమంటారా?' అడిగాడు కామన్న.

'ఈ విషయం నువ్వు చెప్పాలేమిటి?... కారంపెట్టి వండుకుంటే ఏ చచ్చుకూర కమ్మగా వుండదూ ... అయినా నువ్వు చెప్పినట్టు కారంపెట్టి వండుకుందామన్నా మిరపకాయలు చవగ్గా ఏడిశాయనా?... వీశ మూడు, నాలుగూనూ ...' అన్నారు శాస్త్రిగారు.

'చూశారూ ... ఈ నవనవలాడే నల్లొంకాయలు కూర వండుకుంటే, నమలకుండానే జీర్ణం అయిపోతాయంటే నమ్మండి ... అంత ఎందుకు? ... ఈ వేళ మిరికాయలు పుచ్చుకుంటే... రేపు మళ్ళీతీసుకురా... అంటారు ... ఒక్కవీశ కాయలు పుచ్చుకచూడండి.' అంటూ ప్రాధేయపూర్వకంగా 'పోజు' పెట్టేడు.

'ఇంతకీ ధర చెప్తావా - చెప్పవా?' అన్నారు శాస్త్రిగారు కొంచెం కోపంగా.

'ముప్పావలా ఇప్పించండి' అన్నాడు ముక్తసరిగా.

'ఏమిటీ! ...' తెల్లబోయారు శాస్త్రిగారు.

'వీశ —'

'వీశ ముప్పావలా ... చాల్లే ... ఎవరైనా వింటే నవ్విపోతారు. లోకంలోలేని ధర చెప్తావేంటి?' అన్నారు శాస్త్రి.

'అసలు మీరు కాయలు చూశారా ... ఆ నవనవ ... ఆ నిగారింపు ...' అంటూ కామన్న ఇంకా చెప్పుకుపోతుండగా ...

'నవనవ ... ఎవడెరగని నవనవ యిది ... నానా తుక్కువేసి వెధవ పెంపకాలు పెంచుతుంటే ఈ నవనవ రాకేం చేస్తుంది ... నాదగ్గర చెప్పకు నీ కబుర్లు.' అన్నారు శాస్త్రిగారు కోపంగా అడ్డుకుంటూ.

'శాస్త్రులుగారూ ...ఏమిటో చెపతారుకాని... అందరూ మీకుమల్లే... ఓపిగ్గా... పెరట్లో పాదులెట్టుకుని పెంచుతారేంటండీ.' అనేసరికి శాస్త్రులుగారు సగం చల్లబడ్డారు.

'ఇదిగో...నువ్వుచెప్పిన ధరవులే వీశకాదుకదా.. ఆఖరికి అరపంపుకూడ అక్కరలేదు...అసలు లోకంలోనే ఎక్కడా కాయిలు దొరకటంలేట్టు చెపుతావేటి?' అన్నారు శాస్త్రిగారు ఆ చంకనున్న తువ్వాలు ఈ చంకన పెడుతూ.

'నేనెంత చెపుతే అంతా యిస్తారేటండీ ... అడగండి ... గిటితే యిస్తాను; లేకపోతే లేదు...'

'నేనడగటంకాదు. నువ్వే చెప్పు ... ఇంతకయితే గిటుతుంది. లేకపోతే లేదని...'

'అయితే ఆఖరిమాట చెప్పమంటూరా? —'

'ఆఖరిమాటే చెప్పు ... కచ్చితంగా చెప్పు ... ఏం... నీకేమైనా భయమా ... నీకాయలు నీదగ్గరున్నాయి. డాడబ్బు నా దగ్గరుంది.'

'నిజం చెపుతానండి ... సర్గ్గా పదణాలకి కొన్నాను ... దానిమీద ఎంత లాభంయిస్తే అంతా పుచ్చుకుంటాను ... తరవాత మీయిష్టం.'

'లాభంలేదు. ఐదణాలకి, గిట్టుతుందా...ఇదుగో ... నేనిల్లా అడుగుతున్నానని కోపం మాత్రం పడకు. నువ్వు అడగమన్నావుకనక అడుగుతున్నాను.'

'అబ్బే, అంతవారగా అడుగుతే ఎవడిస్తాడండి... సగానికి సగం లేడాయే ...' అన్నాడు కామన్న ఆశ్చర్యార్థకంగా.

శాస్త్రిగారు మాట్లాడలేదు.

ఒక్క నిముషం తరవాత —

'మీకు నిజంగా కావలిస్తే అర్థరూపాయిచేసి తీసుకోండి ...అదేనా మీకు కనక ...' అన్నాడు కామన్న.

'ఇదుగో...వింటున్నావా? ... కాయలు ముమ్మరంగావున్న రోజుల్లోకూడ నువ్వెంత ధరచెపితే ఎవడిచ్చుకుంటాడోయ్ ... కాయలు దొరకనిరోజుల్లో అంటావా...నివ్వెంతచెపితే అంతాయిచ్చి పుచ్చుకునేవాణ్ణి. తెలుసా' అన్నారు శాస్త్రిగారు నిర్లక్ష్యంగా.

'చివరికి ఎల్లాకావాలంటూరు ?...'

'ఆ మాటకూడ నువ్వే చెప్పెయ్...నానోటంపటకూడ ఎందుగ ?...'

'ఏడణాలుచేసి తీసుకుంటూరా...'

కొంచెంసేపు ఆలోచించి—

'ఓ అర్ధణా తీసుకో' అన్నారు శాస్త్రిగారు.

'అంటే ? ...'

'ఐదణాలన్నర'

'మీదగ్గర గుణం యిదేనండి ... కానీ, అర్థణా అంటూరు...అందుకనే ఈ నాలుగునెలలనుంచి మీకు నాకు ఒక్క బేరం కూడ కుదరలేదు.' అన్నాడు కామన్న విసుగ్గా.

'ఏదో ఇచ్చివెళ్ళాలికాని ... వూరికే బేరం ఆడతావెందుకు చెప్పు ... ఈ నాలుగు నెలలనుంచి, నీ దగ్గర ఒకసారికూడ, కూరలు కొనలేదనిచెప్పి ... ముఖ్యంగా కొనకపోతే బాగుండదని ... ఈ రోజున కొందామని బుద్ధిపుట్టింది...అందుకోసం ఈ విధంగా బేరం ఆడుతున్నావ్. అవునా...'

ఒక్క నిముషం ఆగి...

'ఇదుగో...ఇంకోకాని తీసుకుని ఓ వీశ కాయలు తూచు.' అన్నారు శాస్త్రిగారు.

'సరిగ్గా చెపుతున్నాను... ఆరణాలుయిప్పించండి ... ఇంక బేరం అడగద్దు ... కావలిస్తే పుచ్చుకోవటం, లేకపోతే మానెయ్యటం ... అంటూ కావిడి బుజాన వేసుకుని లేవబోయాడు.

'పోనీలే ... రా ...' అంటూ నసిగారు శాస్త్రిగారు.

కామన్న గబగబ తక్కెడతీసి 'బేలన్స్' నిలపెట్టి—

'బాబయ్యగారూ ! జాగ్రత్తగా చూడండి ... మళ్ళీదాళవావుందనగలరు' అంటూ ఒక వైపున రాళ్ళువేసి మరొకవైపున కాయలువేశాడు.

'కామన్న...జాగర్తగాతూచు...అదేమిటి ? ఆ కొమ్ము అలాపైకి లేచిపోతోంది ... ఇంకో కాయి పడుతుందేమో... న్యాయంగా మాత్రం తూచు ... ఇదుగో ... తూకం అంటే ప్రమాణంతో సమానం తెలుసా.' అన్నారు శాస్త్రిగారు.

'నేనెప్పుడైనా దగాచేస్తే మీరలా అనాలి ... ఈసారి చూడండి ... నాతూకానికి, ఒక్క తులం తక్కువస్తే, తులానికి రూపాయి ముదరాయిస్తాను.' అంటూ తూచినకాయలు శాస్త్రిగారి అంగవస్త్రంలో వేసేడు.

‘ఓ రెండు కాయలు వెయ్యి ... అయ్యో ... వీశ కాయలు పుచ్చుకుంటే రెండుకాయలైనా వెయ్యవేంటి?’ అంటూ రెండు కాయలు తీసుకున్నారు శాస్త్రిగారు.

‘ఆ...ఆ ... మీరలా తీయకండిమరి ... అయిన కాడికీ యిస్తూ, ఇదో దండగమళ్ళీను ...’ అంటూ కొంచెం బెట్టుసరిచేసి, డబ్బులు తీసుకుని వెళ్ళిపోయాడు.

తరవాత ఏముంది ? —

చవగ్గా కొనేసేననే ధీమా.

పైగా రెండుకాయలు కొసరు.

శాస్త్రిగారి సంతోషానికి అంతులేదు.

‘ఒసేవ్ ... ఇల్లారా ... వంకాయలుకొన్నాను. జాగ్రత్తచెయ్యి’ అంటూ పంచవూడిపోతున్నా లెక్కచేయకుండ, సంతోషంతో పెళ్ళాం దగ్గరికివచ్చి, ఎదురుగుండా దిమ్మరించారు శాస్త్రులుగారు.

‘ఎన్నికొన్నారు ?’ ప్రశ్నించింది భార్య.

‘వీశ ... శుబ్రంగా నాలుగు కూరలవుతాయి ... కారంపెట్టి మరీవండు’ అన్నారు శాస్త్రి.

‘వీశ ! ...’ అంది ఆశ్చర్యపోతూ.

‘ఏం. చవగ్గా వచ్చేయని వీశ పుచ్చుకున్నాను... నాలుగు కూరలు అవ్వవనా నీ వుద్దేశ్యం ... నిక్షేపంగా అవుతాయి.’

‘అందుకోసం కాదండీ...అసలివి వీశ వుంటాయాయని ?’ అనుమానంగా అడిగింది.

‘మంచిదానివే. వీశ వుండకేం ... దగ్గరుండి మరీ తూయించాను...పైగా రెండుకాయలు కొసరు కూడ వేయించాను’ అన్నారు శాస్త్రిగారు ధీమాగా.

‘ఏమో ... నాకనుమానంగావుంది’ అంది శాస్త్రిగారి భార్య.

‘నీ కంతగా అనుమానంగావుంటే ఓసారి తక్కెడ, రాళ్ళుతెచ్చి, తూచు ... నీ అనుమానం తీరిపోతుంది’ అన్నారు శాస్త్రిగారు.

శాస్త్రులుగారిభార్య, తక్కెడ, తూకంరాళ్ళు తెచ్చింది. ఒకవైపునరాళ్ళు, మరోకవైపున కాయలు వేసి తూచుతూ—

‘వీశ ఎల్లాగ కొన్నారు ? ...’ అడిగింది.

‘చవగ్గానే వచ్చాయిలే...మొట్టమొదట ముప్పావలా చెప్పిన వెధవని ఆరణాలకి వప్పించాను ... ‘వద్దు. మొర్రో’ అంటున్నా రెండుకాయలు కొసరుకూడ లాక్కొచ్చాను’ అన్నారు శాస్త్రిగారు గర్వంగా.

‘మంచిపనిచేశారు’ అంది నవ్వుతూ శాస్త్రిగారి భార్య.

‘ఆ ... ఆ ... ఆ ... అదేమిటి ? ... ఆ కొమ్ము అల్లా పైకి లేచిపోతోంది ... జాగ్రత్తగా పట్టుకున్నావా...నువ్వేసింది వీశరాయేనా ... ఆ... వీశే ... పో నీ పదలంవేసిచూడు ... రామచంద్ర ... సగానికి సగం తరుగే ... పచ్చిదగా. మోసం ... వెధవ ... వీశనిచెప్పి పదలం తూస్తాడా ... రేపు మళ్ళా వస్తాడా ... రానీ చెపతాను ... నలుగురులోను పెట్టి నానాచివాట్లు పెట్టించనూ ... ... ప్రతీరోజూ మనింటిచుట్టు తిరుగుతున్నాడుగదా, ఒకసారీ కొనకపోతే బాగుండదనుకొంటూ, ... ఈ రోజూనే కొన్నాను ... వెధవ...ఇన్నాళ్ళనుంచీ సరదాగా మాట్లాడుతుంటే పెద్ద మనిషనుకున్నాను ... మోసంచేస్తాడన్న సంగతి నాకేం తెలుసు ... తేనెపూసినకత్తి ...’ అంటూ నెత్తి, నోరు, బాదుకుంటూ, నోటికిరాని, నానాతిట్లూ, తిట్టి పోసేడు కావన్నని.

ఆ రోజునుంచి, ఈ రోజువరకు, కూరల కామన్న, కామయ్య శాస్త్రిగారికి, కనబడితే ఒట్టు.